


# బహుమానం


పూర్వం విష్ణురూపుడు అనే రాజు విశాలమైన కాశీ దేశాన్ని పాలించేవాడు. అతడు ప్రజలను కన్నబిడ్డలవలె చూసి కొనేవాడు. అతని రాజ్యంలో ప్రజలందరూ దైవభక్తిగలవారై జీవించేవారు. రాజుకూడ అపారమైన దైవభక్తీ, బ్రాహ్మణ భక్తీగలవాడు

ఇలా ఉండగా-ఒకరోజున ఆ ఊరి దేవాలయంలో ఒక బంగారు పళ్లెం దొరికింది. అది చాలా కాంతివంతంగా మెరిసిపోతోంది. పూజారులకు అది అక్కడకు ఎట్లా వచ్చిందో తెలియలేదు అది దొంగ వస్తువు అయితే రాజు తమను శిక్షిస్తాడు అని వారు భయపడ్డారు. ఇంతలో ఆ పళ్లెంమీద ధగధ మెరుస్తూ కొన్ని అక్షరాలు కనిపించాయి. దానిమీద ఈ వాక్యాలు వ్రాయబడి ఉన్నాయి:- "కాశీ దేశంలో మానవసేవ చేసి జీవించిన వానికి పంపబడిన దైవబహుమానం."

పూజారులు వెంటనే ఈ వార్త రాజుగారికి తెలియచేశారు. రాజు ఈ వింత వార్త విని ఆశ్చర్యపడ్డాడు. తన రాజ్యంలో ఒకరికి అట్టి గొప్ప బహుమానం లభిస్తున్నందులకు ఎంతో ఆనందించాడు. అతడు మంత్రులనూ, పండితులనూ పిలిపించి, వారితో ఆలోచించి, ఈ విధంగా చాటింపు చేయించాడు. "ఈ రాజ్యంలో ఒక గొప్ప బహుమానం లభ్యమయింది. అది మానవ సేవ చేసి జీవించిన వానికి పంపబడిన దైవ బహుమానం—ఈ సాయంత్రం మైదానంలో సభ ఏర్పాటు చేయబడింది - కాబట్టి మీలో ఎవరు ఈ బహుమానానికి అర్హులో, పవిత్రంగా అర్హులో, సభవారికి తెలియచేసి, దానిని స్వీకరించవచ్చును."

రాజు చేయించిన చాటింపు వినగానే, ప్రజలలో సంతోషమూ, ఆశ్చర్యమూ కలిగాయి. ఎవరికివారే తాము ఆ బహు

వసంతరావు వేంకటరామకృష్ణరావు



కలకలలాడే బొమ్మలు!
కొలువులుతీర్చిన బొమ్మలు!

## ★ బహుమానం ★

మానానికి అన్నివిధాలా అర్హులమని అనుకొని ఆనందించారు. సాయంత్రం అయేసరికి, మైదానం జనంతో క్రిక్కిరిసిపోయింది.

విష్ణురూపుడు ఎత్తయిన బంగారు వేదికమీద కూర్చొని ఉన్నాడు. మంత్రి సామంతాది పరివారమంతా అతని చేరువనే ఆసీనులై ఉన్నారు. సభ ప్రారంభమైంది. ప్రజలు అందరూ ముందు ఏమిజరుగుతుందో అని ఆత్రంగా ఉన్నారు.

ఇంతలో ఒక ప్రముఖవైద్యుడు రాజుగారికి వినయంగా నమస్కారం చేసి ఇలా విన్నవించాడు: "ప్రభూ! నేను అనుభవం సంపాదించుకొన్న వైద్యుడిని వైద్యవృత్తిలో నా తల పూర్తిగా నెరిసిపోయింది; జవసత్వాలు అణగిపోయాయి. నేను ఈ వృత్తిలో డబ్బుకొరకు ఆశపడలేదు. ప్రజలకోసం, వారి ఆరోగ్యం కోసం, స్వార్థరహితంగా, డబ్బు పుచ్చుకోకుండా, సేవచేశాను. చాలమందికి ఉచితంగా ఔషధాలిచ్చి సేవచేశాను. నాకు దీనివలన పేరుప్రతిష్ఠలు వచ్చాయి. కాబట్టి నాకు ఆ బహుమానం పొందే అర్హత ఉన్నదని నా మనవి-చిత్తగించాలి." రాజు మెరుస్తోన్న కళ్లతో వైద్యుడివంక చూసి ఆ పళ్లెం అతనికి ఇచ్చాడు.

వైద్యుడు పట్టరాని ఆనందంతో దానిని పుచ్చుకొన్నాడు. పాపం! ఆపళ్లెం అతడి చేతిలో కాంతిని గోల్పోయి, ఇత్తడిగా మారిపోయింది. ప్రజలూ, రాజూ, ఈ వింత చూసి ఆశ్చర్యపడ్డారు. వైద్యుడు అవమానంతో ఆ పళ్లెం అక్కడే విడిచి వెళ్ళిపోయాడు. తిరిగి ఆ పళ్లెం బంగారంగా మారిపోయింది. రాజు దైవనిర్ణయం ఎట్లా ఉందో అని ఆందోళనచెందాడు.

ఈలోగా ఒక పెద్ద వర్తకుడు వచ్చి రాజుకి నమస్కరించి సవినయంగా ఇలా విన్నవించాడు: "ప్రభూ! నేను గొప్ప ఆస్తిపరుడ్ని. నా ధనంఅంతా వ్యాపారంలో ఉంది. ఏటా వ్యాపారంమీద వచ్చే వేలాది బంగారు నాణాలు దానధర్మాల క్రింద వెచ్చిస్తున్నాను. వస్తువులమీద వచ్చే లాభం ప్రజలకే పంచిపెట్టి మానవసేవచేసి జీవిస్తున్నాను. అంతేకాదు - ప్రజలకోసం వైద్యశాలలూ, సత్రములూ కట్టించాను. చెరువులూ, బావులూ త్రవ్వించాను. పండుగలలో దానధర్మాల రూపంలో ప్రజలమీద కనకవర్షం కురిపించాను. కాబట్టి ఆ బహుమానానికి నేను అర్హుడిని - దయచేసి నాకు ప్రసాదించండి." రాజు హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. తన రాజ్యంలో అంతటి దానపరుడు చేస్తోన్న ప్రజాసేవకు రాజు, వర్తకుడిని లోలోన చాలా అభినందించుకొన్నాడు. మెప్పును సూచించే చిరునవ్వుతో, రాజు ఆ బహుమానం వర్తకుడికి ఇచ్చాడు. అతనిచేయి తాకగానే అది ఇత్తడిగా మారిపోయింది. వర్తకుడు చిన్నబుచ్చుకొని, అక్కడనుండి గబగబా నడిచి వెళ్ళిపోయాడు. ఆ పళ్ళెం మళ్లీ బంగారుపళ్ళెంగా మారిపోయింది. అందరూ ఆశ్చర్యపోయారు.

తరువాత ఒక భూస్వామి రాజు గారికి నమస్కరించి భక్తివినయాలతో ఇలా మనవిచేసికొన్నాడు: "ప్రభూ! నేను మీ రాజ్యంలో ఉన్న ఒక భూస్వామిని. నాకు భగవంతుడు ప్రసాదించిన ఆ సంపదను మానవసేవకే వినియోగించి ధన్యుడనయ్యాను. నాకు ఎన్నో ఇళ్ళూ, మిద్దెలూ, భూములూ తోటలూ ఉన్నాయి. ఇవికాక లెక్కలేనన్ని ధనరాసులున్నాయి. వీటిని అన్నిటినీ ఒక్క ఏడాదిలో ప్రజలకు దానంగా పంచిపెట్టేశాను. నేను కష్టపడి పనిచేసి బ్రతుకుతూ ఉన్నాను. కాబట్టి దయచేసి ఆ బహుమానం నాకు ఇప్పించండి." రాజు సందేహంగా చూస్తూ, దైవ సిర్ణయానికి ఆశ్చర్యపోతూ, ఆ బహుమానం భూస్వామికి ఇచ్చివేశాడు. అతడు దానిని ముట్టుకోగానే ఇత్తడిగా మారిపోయింది. ప్రజల ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. భూస్వామి తన దురదృష్టాన్ని నిందించుకొంటూ వెళ్ళిపోగానే, అది బంగారంగా మారిపోయింది.

ప్రజలలో కోలాహలం చెలరేగింది. ఒక ముసలిరైతు వేదిక వద్దకు వెళ్ళదలచి, తిరిగి వెనక్కు మరలిపోయాడు. రాజు అతడిని పిలిపించాడు. ముసలిరైతు భయంతో వణికిపోయాడు. కంఠస్వరం కంపిస్తోంది. ముసలితనంవల్ల ముడుతలుపడిన బడుగు శరీరంతో రాజుగారికి నమస్కారంచేసి ఇలా విన్నవించాడు—"మహాప్రభూ! నన్ను మన్నించండి. నేను నిరుపేదను. భూమిదున్ని దారిద్ర్యంతో జీవయాత్రచేసిన అభాగ్యుడను. నాకు పేదసాదలకు సహాయంచేసే అవకాశాలు లేవు. వారిని చూసినపుడల్లా నాగుండె తరుక్కుపోయేది. కళ్ళ వెంబడి నీళ్ళు కారేవి. వారికోసం నా హృదయం ఆరాటపడేది. ఎంతటి కష్టాలలో ఉన్నావారికి భగవంతుడి మీద విశ్వాసంతో ఉండమని చెప్పి, ధైర్యం కలిగించేవాడిని. అల్లాంటి నేను ఈ బహుమానానికి ఏ విధంగానూ అర్హుడను కానని అంతరాత్మ చెప్పింది. అందువల్ల వెళ్ళిపోతాను. సెలవు" రాజు మనస్సులో ఒక వింత ఆలోచన మెరిసింది. ఆ ముసలి రైతు చేతిలో ఆ బహుమానం పెట్టేశాడు. ప్రజలు వింతగా చూస్తున్నారు. ఆ బంగారుపళ్ళెం ఎంతో కాంతివంతంగా అతని చేతులలో మెరసిపోతోంది! దైవ నిర్ణయానికి అందరూ ఆశ్చర్యపడ్డారు. సభ ముగిసింది.

మరునాడు, రాజ ప్రాసాదంలో విష్ణురూపుడు కొలువుతీర్చి, ముసలి రైతుకి ధనకనక వస్తు వాహనాలను ఇచ్చి సత్కరింప బోయాడు. కాని ఆ రైతు వినయపూర్వకంగా ఇట్లా చెప్పుకొన్నాడు: "మహారాజా! మీ అభిమానమే నాకు గొప్ప బహుమానం—అది సాటిలేని సన్మానం కూడా. నాకు డబ్బువద్దు. మన్నించండి. సంపదవలన దేవునికీ మానవునికీ దూరమవుతాను!" రాజు రైతును చాల అభినందించాడు.

("ప్లేట్ ఆఫ్ గోల్డు" చదివి)

# సీతాకోక చిలుక

★

శ్రీ॥ కోటి

★

రంగు రంగుల రెక్కలతో
రమ్యమైనదీ చిలకమ్మ!
బంతి పూవుపై వాలింది
సీతాకోక చిలుకమ్మ!

ఆటకు తోడెవరు లేరో
ఒంటరిగానే వచ్చింది
అమ్మా, నాన్న లేరేమె
విచారంగా కూచుంది!

ఆటకు రమ్మంటే తోడుగా
నేస్తం నాతో కడుతుందో!
చెలిమి కట్టి చెంతకు నేవెడితే
తుర్రున ఎగిరే పోతుందో!

అయితే గమత్తు చేస్తాను
వెనుక మారుగా వెళ్తాను
చప్పున రెక్కలు పట్టుకొని
ఇంటికి తీసుక వస్తాను.

అంటూ మెల్లన నేవెళ్తే
ఎట్లా నన్నూ చూసిందో
రెపరెప ఎగిరే పోయిందది
చమ్కీ టోపీ వేసింది!